ఉగాది మినీకథల పోటీలో మూడవ బహుమతి రు. 100/- పొందిన కథ

# అదొక్కటే తప్ప

అన్నావఝ్ఝుల సరస్వతీకుమారి

అనగనగా ఓ తండ్రి.

ఆ తండ్రికో పాప.

ఆ పాప పుట్టి తనని తండ్రిని చేసినందుకు ఆ తండ్రి హృదయం సంతోషంతో తలమునకలైంది.

పట్టుకుచ్చుల్లాంటి ఆ చిరు కాళ్ళు....

చిరుగంటలాంటి ఆ గుప్పిళ్ళు....

ముద్దు ఆపుకోలేకపోయేడు.

ఉన్ని మేజోళ్ళూ, వెండి పట్టాలూ, బంగారు మురుగులూ చేయించి మురిసిపోయేడు.



ఓణీ వయసు వెనక విజయవాడలో జననం. ఇంటర్మీడియెట్ పుణ్యమాని భాగ్యనగరంలో చిరుద్యోగం. పేరు చివర 'కుమారి' వ్యర్థపదం కాదు— ఇవీ వివరాలు.

— అన్నావఝ్ఝుల సరస్వతీకుమారి

---

పాకే వయసులో రవ్వల లోలకులు చేయించి అవి అలవోకగా వూగుతూంటే అంబర వీధుల్లో సంబర పడ్డాడు.

జూకాలు, పులిగోరు, పాంజేబులు, పట్టాలు, మొలతాడు, సిగ్గుబిళ్ళ, కుచ్చుల గౌన్లు, పట్టు పరికిణీలు, వెల్వెట్ జాకెట్లు, రంగు రిబ్బన్లు, బొండు మల్లె పూలు, వంకీలు, మిరియం గాజులు, ముత్యం ఉంగరాలు, ముద్దు పాపిడిబిళ్ళ, చేమంతి నాగరం, సీత జడకుచ్చులు—

వేసింది వేయకండా, తీసింది తీయకండా ఎన్ని మురిపాలు, ఎన్ని షోకులు, ఎన్ని గారాల వరాలు, గారాబు బిడ్డని కళ్ళలో పెట్టుకు పెంచితే ఎంత మురిపెం! ఎంత ఆనందం!

చూసే కళ్ళకి అసూయ....

పెంచే చేతులకి అమృతపు చాయ....

ఆ పిల్ల నవ్వితే నవరత్నాలూ....

నాజూకు మల్లెలూ.... అసలు ఏడవనిస్తేనా.

లేకలేక కలిగిన సంతు!

పిల్లల శరీరం చాయ మాసినా....

నిద్దట్లో ఏడ్చినా.... కన్నతల్లికైనా సరే... ఉరిశిక్షే....

పాకినంత మేరా పట్టు పరుపులు పరిచి..

అడుగువేస్తుంటే అరిసెలు పంచి....

ఏడుమల్లెల ఎత్తుగా....

ఆ చిన్నారి మాటలకి ఎంత పరవశం!..

ఆ చూపుల సంజ్ఞలకే కొండ మీది కోతులు....

మాటవచ్చినా కానీ పెదవి కదిపే అవసరం వుందా....

ఏం కావాలన్నా క్షణంలో హాజరు కాదూ....

తన పిల్ల బంగారు తల్లి కాదూ....

ఆ గారాల కూచీ.... బాచాల కొండ....

చుక్కల్లో చంద్రుడిలా ప్రత్యేకంగా వెలగాల్సిందే....

శుక్లపక్షం వెన్నెల్లా దినదిన ప్రవర్ధమానంగా పెరగాల్సిందే....

ఈ ప్రత్యేకత ఇంకొకరి కొచ్చేనా....

ఈ అబ్బురం ఇంకొకరి కబ్బేనా....

ఈ అదృష్టం తనదే కాదూ....

ఈ భాగ్యం తనకే కాదూ....



అమడ దూరంలో ఎవరేనా సరిపోల గలరా తమ పిల్లతో ....

ఆ అందచందాలు....

ఆ వన్నె చిన్నెలు....

ఈ సిరి సంపదలకి సరి సమానంగా..

మీదుమిక్కిలి ఆ తెలివితేటలు....

ఇత్తడి ఇత్తడే.... పుత్తడి పుత్తడే....

పుణ్యంకొద్దీ ఇంటవెలసిన మహాలక్ష్మి.

ఒకింత లోపం జరగడమే ....అమ్మో:

కన్నప్రేమకే గొడ్డలిపెట్టు కాదూ....

ఎంత కోరరానిదైనా తీర్చాల్సిందే.

ఎంత కష్టసాధ్యందైనా తేవాల్సిందే... ఈయాల్సిందే.

ఈ భూమ్మీద ఆ చిన్నారి చేతులకు.... అందరానిదంటూ వుండకూడదు ....పొంద లేనిదంటూ తలవకూడదు.... అదేగనక జరిగితే.... అవమానం కాదూ....

చిట్టితల్లి కంట ముత్యాలు రాలవూ....

కంఠంలో ప్రాణం వుండగా ఈ కన్న కడుపు ఆ కోత భరించగలదా....

కన్నబిడ్డకోర్కె తీర్చలేని కన్నతండ్రి బతికేం ?....చచ్చేం ?....

ఐనా అదృష్ట జాతకం కాదూ....

ఏం చురుకు ....ఏం తెలివి....

వయసు పెరుగుతూన్నకొద్దీ .... ఏం విచక్షణాజ్ఞానం....

పిల్లల్ని కనగానే సరికాదు....

అనుక్షణం అవసరాల్ని కనిపెడుతూ పెంచడం కూడా రావాలి.... కనుపాప లాగా కాపాడుకో తెలియాలి.. కష్టమన్నది తెలీకుండా పెంచుకోగలగాలి.. అప్పుడు.. పిల్లల్ని పెంచడంలోగల మజా తెలిసేది..

అప్పుడా పిల్లలు యింటికి మణి దీపాలు కారూ.... మనసు కనిపెట్టి కొండ మీది కోతిని దింపుతూంటే....

ఈ కంటికి ఆ రెప్ప దూరమౌతుందా? ఔతుందా? ఎలా ?....

“నిజమేనా ?”

“నిజం నాన్నా నేనాబ్బాయిని ప్రేమిం చాను.”

“ఛఫ్ : జెష్టముండా. ఈ పదారేళ్ళు నువ్వు పెదవి విప్పనవసరం లేకండానే నీ అవసరాలు కనిపెట్టి కనుపాపలా చూస్కు న్నాను కదే.”

“నీ ముద్దు కోసం ఈ పదహారేళ్ళూ నా ప్రమేయం లేకుండా పెంచి నీ అచ్చట్లూ ముచ్చట్లూ తీర్చుకున్నావ్ నాన్నా! ఇప్పుడు నా భవిష్యత్తుగూర్చి ఒక నిర్ణయం తీసుకుంటున్నాను. ఇదీ నా జీవితం ....లక్క పిడతల ముచ్చట్లు తీర్చి, నా పెళ్ళి విషయంలో స్వేచ్ఛ హరించడం ఏం న్యాయం నాన్నా....”

“ఎంతో అల్లారుముద్దుగా పెంచిన నన్ను.... నన్ను ఎదిరిస్తావుటే.

“జన్మనిచ్చావు. ముద్దు మురిపాలు తీర్చుకున్నావు.నా జీవితం నాకిష్టం వచ్చిన రీతిలో మలచుకునే స్వేచ్ఛనివ్వు నాన్నా.”

“ఛఫ్! నా కడుపున చెడపుట్టావు కదే” చెంప ఛెళ్ళుమంది.

మళ్ళీ అన్నివిధాలైన కట్న కానుకల లాంఛనాలతో ఆ ఆడపిల్ల బతుకు పెళ్ళి పీటలమీద బలైపోయింది.

## ఒంటరితనం ఓడ

పెద్ద బయలుమధ్య  
సగం కట్టి వదిలేసిన భవనం  
ఎడారిలో నిట్టూరుస్తూ కునికితే

ఒంటరి ఒంటె—  
పిట్టగోడల్లేవు—  
టెర్రెస్ మేడ,  
దిగడానికి దారి కనపడక

కదలకుండా నేను—  
ఆగిపోయిన గోడ గడియారం

పెండ్యులం బిళ్ళ  
ఆకాశంలో చంద్రుడు—

ఒంటరితనం ఓడలాంటిది  
మనలో మనం గడిపేయడానికి

ఎన్ని వసతులున్నా  
అడుగున సముద్రం వుంది—

పద— ఎదురుచూడు—  
నేనూ వస్తున్నా— అన్నాడు

నల్లనివాడు, వెలుగు కన్నులవాడు  
నగ్నముని—

ఆ కంఠంలో—  
లోయ నిండుగా విరగబారి

పసుపుకున్న ఆదిమారణ్యాల  
హరిత కాఠిన్యం,  
భూమిని చీల్చుకుని  
ఆకాశాలకు చేతులు చాచే  
జీవశక్తి,

నాకు ఒంటరి మనస్సు నిండుగా  
వంద వయొలిన్ల ఉద్రిక్త స్వర  
సహవాసాన్నిచ్చాయి.

శ్వేత వసనాల నిశ్శబ్ద జలపాతం  
నగ్నముని—  
దూరంగా— వస్తున్నాడు కాబోలు  
గట్టిగా పిలిచాను—  
కాడు— రాలేదు  
లోయలో ఆదిమారణ్యాలు  
కెరటాలు కెరటాలుగా  
వయొలిన్‌ల చుట్టూ  
అల్లుకొంటున్నాయి.  
ఇప్పుడు  
బయలు లేదు ;  
భవనం లేదు  
ఒంటె లేదు :  
వెన్నెల వెళ్ళిపోయింది—  
కళ్ళుతెరిచి చూద్దునుకదా.  
చుట్టూ ఎరుపెరుపు పడక గది  
చీకటి—  
గోడగడియారం పెండ్యులమ్  
కదలిక—

తేదీమారి, ఇరవై నిమిషాలైంది.

[గమనిక :- ఈ కల ఎందుకొచ్చిందో నాకు తెలియదు. విన్నవాళ్ళు ఏమనుకుంటారో తెలుసు. అయినా, నగ్నమునీ, అందుకో ఈ గీతం—]

—ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

ఆంధ్రజ్యోతి

మీ ఇంటిల్లిపాదికి సత్కాలక్షేపం

ప్రతిరోజూ రెండవ పేజీలో (20-3-1981నుంచి) సీరియల్

‘సమరం-శాంతి’ రచన: వాచస్పతి

తప్పక చదవండి ! చదివి ఆనందించండి !